# ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



కలెక్టరేట్ నుంచి వీసీకి హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

- పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులు పరిష్కరించాలి
- 'సీ విజిల్' యాప్‌పై అవగాహన కల్పించాలి
- సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్‌వ్యాస్
- పోలింగ్ నిర్వహణపై వీసీ ద్వారా సమీక్ష
- హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, అక్టోబర్30: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్‌వ్యాస్ సూచించారు. సోమవారం ఆయన న్యూఢిల్లీ నుంచి ఎన్నికల పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా, హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఉన్నతాధికారులు, జిల్లా నుంచి ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ నితేశ్‌వ్యాస్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ సమయంలో సమయపాలన పాటించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలని, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం యంత్రాల రెండో ర్యాండమైజేషన్ చేపట్టాలని, అభ్యర్థులు అధికంగా ఉంటే సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ సక్రమంగా జరిగేందుకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని, ఈవీఎం యంత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఈవీఎం యంత్రా లు తరలించే అధికారులకు అవసరమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, కేంద్రాల జాబితా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు అందించాలని సూచించారు. సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బం ది, మీడియా ప్రతినిధులు, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల తనిఖీలలో నగదు జప్తు చేసే సమయంలో జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ప్రతిరోజూ వచ్చే అప్పీల్‌పై చర్చించి నిర్ణ యం తీసుకోవాలన్నారు. ₹10లక్షల కంటే ఎక్కు వ నగదు జప్తు చేసే సమయంలో ఐటీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్ర స్థాయి పర్యటన ఉంటుందని, అందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు.

### ఖర్చు చేసే ప్రతి పైసానూ లెక్కించాలి

అనంతరం ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్‌జయంతి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసాను లెక్కించాలన్నారు. వ్యయ లెక్కింపు బృందాలకు మరోసారి శిక్షణ నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్థులకు గుర్తుల కేటాయించాలని సూచించారు.

# కమనీయం.. వెంకన్న రథోత్సవం



పురవీధుల్లో రథంపై విహరిస్తున్న స్వామివారు

- రథంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు
- గోవిందనామస్మరణలతో మార్మోగిన లింగపేట
- ప్రత్యేక పూజలు చేసిన కొండూరి రవీందర్‌రావు, ఆగయ్య

గంభీరావుపేట, అక్టోబర్ 30: లింగన్నపేటలోని హరిహర ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం స్వామివారు ఉదయత్పూర్వం ఐదు అంతస్తుల రథంపై నుంచి దర్శనమివ్వగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందనామస్మరణతో పురవీధులన్నీ మార్మోగాయి. చిన్నారుల కోలాటాలు, వేషధారణలతో స్వామివారి రథానికి స్వాగతం పలికారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రథం వద్ద ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్ దొంతినేని చైతన్య, ఎంపీటీసీ రేణుక, ఉపసర్పంచ్ దుబాసి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ దొంతినేని పాపారావు, వేదపండితులు వ్యాసోజ్జుల రామశర్మ, రాధాకృష్ణ, గోపీకృష్ణ, దేశపతి సుదర్శనశర్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ఏఎంసీ చైర్మన్ హన్మంత రెడ్డి, నాయకులు లింగన్నగారి దయాకర్‌రావు, వెంకట్రావు, కృష్ణమూర్తిగౌడ్, చారి, రమేశ్, కిష్టయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, నాయకులు

# పారదర్శక ఎన్నికల నిర్వహణకే కవాతు



ఇల్లంతకుంట మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న సీఐ సదన్ కుమార్, ఎస్ఐ , బీఎస్ఎఫ్ బలగాలు

ఇల్లంతకుంట ,అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికే ఈ కవాతు నిర్వహిస్తున్నామని రూరల్ సీఐ సదన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు గాలిపెల్లి, జవారుపేట, కందికట్కూర్ గ్రామాల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాడానికి అందరు సహకరించాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు స్వేచ్ఛా వాతారవణంలో ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సుధాకర్, హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య బీఎస్ఎఫ్ బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

కోనరావుపేట, అక్టోబర్ 30: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఎస్ఐ అంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని సుద్దాల, మల్కపేట, నిజామాబాద్, ధర్మారం గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో ప్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఎన్నికల వేళా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని ఎస్ఐ సూచించారు.ఇక్కడ పోలీసు సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థినికి అభినందన

తెలంగాణ చౌక్, అక్టోబర్ 30: జాతీయస్థాయిలో ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిని హెచ్ఎం శారద సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 7-10 తేదీల్లో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థిని సమర్థతో రూపొందించిన ఎగ్‌షెల్ రిమూవర్ ప్రాజెక్టు మధ్యాహ్న భోజన కార్మికులకు చాలా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇలాంటి ఆలోచనలతో ముందుకెళ్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇక్కడ గైడ్ టీచర్ దోర్నాల భూపాల్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు తిరుపతి, అనురాధ, ప్రకాశ్, రవిబాబు ఉన్నారు.

# పోటెత్తిన భక్తజనం

- వేములవాడ రాజన్న ఆలయానికి 25వేలకు పైగా మంది రాక
- సమకూరిన ₹18లక్షల ఆదాయం



క్యూలైన్లలో దర్శనంకోసం నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 30: వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో పోటెత్తింది. సోమవారం కావడంతో వేకువజామునుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. క్యూలైన్లమీదుగా ఆలయంలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో అభిషేక, ఆకుల, కుంకుమ, అన్నపూజలు నిర్వహించారు. స్వామివారిని దాదాపు 25వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, రాజన్నకు సుమారు ₹18లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు అల్లి శంకర్, తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, శ్రీనివాసరెడ్డి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో పట్టణంలో అవాంఛనీయ ఘ టనలు జరుగకుండా పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ఏసీబీ వలలో అవినీతి చేప



ఏసీబీకి పట్టుబడిన ఉపేందర్‌రావు

- ₹13వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఉపేందర్‌రావు
- కేసు నమోదు.. ఏసీబీ కోర్టుకు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ వీవీ రమణామూర్తి

కలెక్టరేట్, అక్టోబర్ 30: సమీకృత కలెక్టరేట్ సముదాయాల కార్యాలయంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉపేందర్‌రావు లంచం తీసుకుంటుండగా, అవినీతి నిరోధకశాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ వీవీ రమణామూర్తి వెల్లడించారు. వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామానికి చెందిన భూక్యా సరిత టిప్పర్ సబ్సిడీ కోసం కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ హైదరాబాద్‌కు దరఖాస్తు చేసుకున్నది. కాగా అప్లికేషన్‌ను అనుకూలంగా పంపడానికి ఉపేందర్‌రావు ₹30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న ₹17వేలు తీసుకోగా, మిగతా ₹13వేలు భూక్యా శివ కుమార్ (సరితకు సంబంధించిన బంధువు) వద్ద పట్టణంలోని జడ్పీ హైస్కూల్ గీతానగర్‌లో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉపేందర్‌రావుపై కేసు నమోదు చేసి, ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు. జిల్లాలో ఏ శాఖలోనైనా అధికారులు అవినీతికి పాల్పడితే నంబర్‌కు (91543-88954) ను సంప్రదించాలని సూచించారు.


## ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ బండి సింధూర, D/o ఎల్లయ్య, వంతడుపుల గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన గూన ఇల్లు H.No. 1-17, మరియు దీని యొక్క ఖాళీస్థలం కలిపి మొత్తం దీని యొక్క వైశాల్యం: 333 చ||గ||, (Tiled plinth area 200 Sq.fts), వంతడుపుల గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు.కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 30-10-2023 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558